2న ప్రధానితో జన్‌మన్ పకనకుడిలో..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకులోయ, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో వర్చువల్ విధానంలో అరకులోయ మండలం పకనకుడిలో అక్టోబర్ 2న జన్‌మన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శితో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొని అరకులోయ మండలంలోని పకనకుడి గ్రామంలోని ప్రజలతో మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వం మారినా.. పేర్లు మారలేదు



చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయినా ఇంకా కొన్ని చోట్ల గత ప్రభుత్వ పథకాల పేరుతో ఉన్న ప్రకటన బోర్డులు దర్శనమిస్తున్నాయి. వైకాపా హయాంలో నవరత్నాలు పేరుతో పలు పథకాలు ప్రకటించింది. ప్రభుత్వం మారినా కొత్తపాలెం గ్రామ సచివాలయంపై ఆ పథకం బోర్డు మాత్రం తీయలేదు.

కష్టానికి గుర్తింపు.. పదవుల్లో ప్రాధాన్యం కూటమి ఖుషీ

కూటమి విజయానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వం కొలువుతీరి వంద రోజులు పూర్తయిన వేళ రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు సభ్యులను నామినేట్ చేశారు. అందులో అనకాపల్లి, అరకు పార్లమెంటు పరిధిలోని పలువురు నేతలకు చోటుదక్కింది.

ఈనాడు, పాడేరు, అనకాపల్లి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పొత్తుకోసం సీట్లు త్యాగం చేసిన సమన్వయకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి ఇద్దరికి కార్పొరేషన్ ఛైర్మన్లగా అవకాశం కల్పించగా మరో అయిదుగురిని డైరెక్టర్లుగా నియమించారు. తెదేపాతో పాటు భాజపా, జనసేన పార్టీలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు సామాజిక వర్గాలపరంగా సమన్యాయం పాటించారు. తర్వాత దశలో మరిన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, పార్టీకి పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఇప్పుడు అవకాశం దక్కని నేతల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.

పీలాకు పెద్దపీట..



కశింకోటలో పీలాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, బుద్ధ, కూటమి నేతలు

అనకాపల్లి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం దక్కింది. పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా ఆయన్ని నియమించారు. 2014-19 వరకు అనకాపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్న వేళ పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేన పార్టీకి కేటాయించారు. అయినా నిరాశ చెందకుండా కూటమి ప్రభుత్వ విజయమే లక్ష్యంగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ వెన్నంటే నడిచారు. ఆయన గెలుపు బాధ్యతలను భుజాన వేసుకున్నారు. మూడు పార్టీలనూ సమన్వయం చేస్తూ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించారు. ఎన్నికల ప్రచార సభల్లోనే తెదేపా, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు పీలాను అభినందించారు. తాజాగా నామినేటెడ్ పదవి ఇచ్చి మరింత గుర్తింపునిచ్చారు.

తాతయ్యబాబుకు డబుల్ గుర్తింపు..

చోడవరం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదికి చెందిన బత్తుల తాతయ్యబాబు ఎన్నికల ముందు వరకు చోడవరం నియోజకవర్గ తెదేపా సమన్వయకర్తగా కొనసాగారు. సీట్ల కేటాయింపునకు వచ్చేసరికి సమీకరణాలు మారి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజునే బరిలో నిలిపారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి తాతయ్యబాబు కూటమి అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా పనిచేశారు. ఆయన నిబద్ధతను గుర్తించి అప్పుడే అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమించారు. జనసేనతో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్లి చోడవరంలో కూటమి అభ్యర్థి రాజు భారీ విజయం సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన సేవలు గుర్తించి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమించడంతో తాతయ్యబాబుకు డబుల్ గుర్తింపు ఇచ్చినట్లయింది. ఛైర్మన్ పదవి దక్కడంపై పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



తాతయ్యబాబుకు మిఠాయి తినిపిస్తున్న కార్యకర్తలు

కృష్ణారావుకు ట్రైకార్‌లో..



పాడేరు నియోజకవర్గానికి చెందిన భాజపా నాయకులు కృష్ణారావును ట్రైకార్ సభ్యుడిగా నియమించారు. 2024 ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ నుంచి ఈయన పోటీకి సిద్ధమయ్యారు. కూటమి పొత్తుల్లో భాగంగా ఈ సీటు తెదేపాకు కేటాయించడంతో అవకాశం కోల్పోయారు. ఆ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి తరపున ప్రచారం చేశారు. భాజపా అధిష్ఠానం ఈయన సేవలను గుర్తించి నామినేటెడ్ పోస్టుకు సిఫార్సు చేసింది.

పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా రమేష్‌నాయుడు



పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు నియోజకవర్గానికి చెందిన కిల్లు రమేష్ నాయుడిని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. పాడేరు మండలం పాతపాడేరు గ్రామానికి చెందిన ఈయన ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవారు. 2024 సాధారణ ఎన్నికల ముందు ఉపాధ్యాయ కొలువుకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. చేరిన కొద్ది రోజుల్లోనే నియోజకవర్గ స్థాయిలో పార్టీ పటిష్ఠానికి ఈయన చేసిన సేవలను గుర్తించిన అధినేత చంద్రబాబు పాడేరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఖరారు చేశారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో ఈయనను తప్పించి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇచ్చారు. అయినా పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు.

పౌరసరఫరాల సంస్థలో వంతలకు చోటు



రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టరుగా మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి నియమితులయ్యారు. ఎస్టీ కొండరెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఈమె 2014లో వైకాపా తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017లో తెదేపా చేరారు. 2019లో తెదేపా తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందారు. ఆ తర్వాత నుంచి 2024వరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో శిరీషాదేవికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడంతో ఆమె విజయానికి పనిచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నామినేటెడ్ పదవుల్లో రాజేశ్వరికి చోటు దక్కింది.

దొరకని ఆచూకీ.. ఆగని గాలింపు

ఆందోళనలో విద్యార్థి కుటుంబం



జలతరంగిణి జలపాతం వద్ద గాలింపు చర్యలను పరిశీలించి, సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజాము నుంచే సహాయక బృందాలు గాలింపు ప్రారంభించాయి. రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్దకు ఆదివారం వచ్చిన ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన 14 మంది వైద్య విద్యార్థుల్లో ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర విపత్తుల సహాయక బృందాలు, అటవీశాఖ సిబ్బంది, సీబీఈటీ సభ్యులు అవిశ్రాంతంగా వాగులు, వంకల వెంబడి గాలిస్తూనే ఉన్నారు.

పాములేరు వెంబడి డ్రోన్లతో ... గాలింపు చర్యలను రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, అటవీశాఖ డీఎఫ్‌వో బబిత పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులుగా జలపాతం పరిసరాలను జల్లెడ పట్టినా ఫలితం లేకపోవడంతో ప్రవాహానికి సదరు విద్యార్థి పాములేరులో కొట్టుకునిపోయి ఉండొచ్చనే అనుమానంతో డ్రోన్లతో వాగు వెంబడి గాలిస్తున్నారు. సీఐ గోపాలకృష్ణ, తహసీల్దార్ కారం సుబ్బారావు రాత్రింబవళ్లు అక్కడే ఉండి సహాయక చర్యలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా హరదీప్ తల్లిదండ్రులతో పాటు, స్నేహితులు, బంధువులు ఇక్కడే ఉండిపోయారు. గాలింపు జరుగుతున్న ప్రదేశాల్లో వారు ఉండి, ఆచూకీ దొరక్కపోతుందా అనే ఆశతో ఎదురుచూస్తూనే.. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం ఉదయం గాలింపు ప్రదేశానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.

లక్షలు వెచ్చించి... లక్షణంగా వదిలేసి...

- వైద్య పర్యటకంపై వైకాపా ప్రభుత్వం చిన్నచూపు
- కూటమి సర్కారే దారిచూపాలిక..

అరకులోయ, న్యూస్‌టుడే

ఆంధ్రా ఊటీ అరకులోయను కేరళ తరహాలో మెడిసినల్ పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేశారు. తదనంతర వైకాపా ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించడంతో లక్ష్యం నీరుగారింది.

ప్రకృతి రమణీయ ప్రదేశమైన అరకులోయ పర్యటకుల మనసు చూరగొంది. ఈ ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కేరళ తరహాలో మెడిసినల్ పర్యటకానికి అప్పటి తెదేపా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అనుకున్నదే తడవుగా అరకులోయకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తవలస వ్యవసాయ ప్రదర్శన కేంద్రంలో ఔషధ మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఔషధ విభాగ కేంద్రానికి ఈ పనులను అప్పగించింది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మొక్కలను ఇక్కడ కొలువుదీర్చింది.





కేంద్రంలో పెంచుతున్న ఔషధ మొక్కలు



కొత్తవలసలోని పాలీహౌస్

పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో కొత్తవలసలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఈ పెంపకాన్ని ప్రారంభించారు. సుమారు రూ. 20 లక్షలు వెచ్చించి 150 వివిధ రకాల మొక్కలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. స్థానికంగా లభించే మరి కొన్ని రకాల మొక్కలను ఇక్కడ అందుబాటులో ఉంచారు. ఆయా మొక్కలు ఎటువంటి అనారోగ్య సమస్యలను నయం చేస్తాయో వివరించేలా బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. పర్యటకులకు అంతరిస్తున్న ఔషధ మొక్కలపై అవగాహన కల్పించడంతోపాటు స్థానికంగా ఉన్న గిరిజన రైతులకు ప్రోత్సహించేందుకు ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. 2020లో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనను వైకాపా ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేయడంతో ఔషధ మొక్కల పెంపక కేంద్రం అలాగే ఉండిపోయింది. పర్యటకుల ఆదరణకు నోచుకోలేదు. వీటి పెంపకంపై రైతులకు ఆసక్తి కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పాలీహౌస్ సైతం నిరుపయోగంగా ఉంది.

> మెడిసినల్ పర్యటక ప్రాంతంగా అరకులోయకు ప్రత్యేక స్థానం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరముందని స్థానికులు పేర్కొంటున్నారు. పాడేరు ఐటీడీఏ అధికారులు దీనిపై చొరవ చూపాలని కోరుతున్నారు.

ఎక్కడ చూసినా 'గం'జాయ్'

రామాపురం కాలనీకి చెందిన నీలగిరి హరీష్ (25) గంజాయి అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందిందింది. జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వారికి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నలుగురు యువకులకు సరకు ఇస్తుండగా ఇతనిని పోలీసులు పట్టుకున్నారు.

ప్యాకెట్ల రూపంలో అమ్మకాలపై నిఘా



చిన్నచిన్న ప్యాకెట్లలో అమ్మకాలు



పాడేరు, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

గంజాయికి యువత బానిసవుతున్నారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పొగాకు నియంత్రణ విభాగానికి గంజాయికి అలవాటు పడ్డ యువకులు ఎక్కువగా వస్తుండటం సమస్య తీవ్రతను తెలుపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనకాపల్లి గంజాయి రవాణా కేంద్రంగా మారింది. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా ఏజెన్సీ నుంచి అధిక సంఖ్యలో గంజాయి తరలిపోయేది. దీనికి అడ్డుకట్ట వేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల కాలంలో దాడులను ముమ్మరం చేయడంతో గంజాయి భారీగానే పట్టుబడుతోంది. ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకొచ్చి వాటిని ప్యాకెట్లుగా కట్టి అమ్మకాలు చేస్తున్నారు. పోలీసుల తనిఖీలతో ఈ తరహా అమ్మకాలు వెలుగుచూడడంతో వీటికి అడ్డుకట్ట వేసే పనిలో పడ్డారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే తెలిపితే వివరాలు గోప్యంగా ఉంచి విచారణ చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు ప్రచారం చేస్తున్నారు.

> గంజాయిని సీసాలో నింపి దానికి గొట్టాలు పెట్టి తాగుతున్నట్లు గుర్తించారు. మైకంలోకి వెళ్లేందుకు ఈ తరహా అలవాట్లను అనుసరిస్తున్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.



సీసాకి ఇలా గొట్టంలా పెట్టి గంజాయి పీలుస్తూ...

నిరంతర నిఘా



చిన్నచిన్న ప్యాకెట్లతో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించి దానిపై ఆరా తీస్తున్నాం. అనకాపల్లిలో ఏ ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తున్నారు. ఎవరు కొనుగోలు చేస్తున్నారన్న దానిపై నిఘా పెంచాం. గంజాయి అమ్మకాలను పూర్తిగా అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

– విజయ్‌కుమార్, అనకాపల్లి పట్టణ సీఐ



ఇటీవల పట్టుబడిన గంజాయితో ఎస్పీ దీపిక, సిబ్బంది

చెడు అలవాట్లకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

హుకుంపేట, న్యూస్‌టుడే: యువకులు చెడు అలవాట్లు, మత్తు పదార్థాలవైపు కాకుండా వ్యక్తిగత, గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. కామయ్యపేటలో గంజాయి నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు గుర్తింపు సాధించుకోవాలనే లక్ష్యంతో ప్రతి రోజు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగం కోసం చూసి జీవితం వృథా చేసుకోకుండా ఒకవైపు ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే మరోపక్క వ్యక్తిగతంగా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మంచి మార్గంలో కష్టపడి పనిచేసి కుటుంబానికి గ్రామానికి పేరు తేవాలని కోరారు. సీఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



చెట్టు కిందే భోజనం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు తీరడం లేదు. గత ప్రభుత్వం నాడు- నేడుతో బడుల్లో సమూల మార్పులు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకొంది. అయిదేళ్లు గడిచినా బడులు బాగుపడలేదు. భోజనశాలలు లేక కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆరుబయట చెట్ల నీడలో భోజనాలు చేస్తున్న దృశ్యమిది. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

జాతీయ స్థాయి పోటీలకు సీలేరు విద్యార్థి ఎంపిక



కేతన్ సాయి కౌశిక్

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరుకు చెందిన ఎం. కేతన్ సాయి కౌశిక్ టేబుల్ టెన్నిస్ అండర్-19 విభాగంలో వచ్చే నెలలో లడక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 19 నుంచి 22 వరకూ విజయవాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టేబుల్ టెన్నిస్ అండర్-19 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున ఆడిన కౌశిక్ ప్రథమస్థానం సాధించాడు. కౌశిక్ విశాఖలో చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి ఎం.జోగారావు ఏపీ జెన్‌కోలో జూనియర్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్నారు.

నిర్విరామంగా శ్రమించే సీఎం చంద్రబాబే

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రం కోసం నిర్విరామంగా శ్రమించే ముఖ్యమంత్రి చంద్రబాబేనని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మంగళవారం కొత్తపాలెంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత తెదేపా హయాంలోనే 50 సంవత్సరాలు నిండిన గిరిజనులకు రూ. రెండు వేల పింఛను మంజూరు చేశామని, ఇప్పుడు రూ. 4 వేలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇంతవరకు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లని పాడేరు ఎమ్మెల్యే ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని, మాట ఇచ్చి మడం తిప్పేందుకు తమది వైకాపా ప్రభుత్వం కాదని ఎద్దేవా చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, సుబ్బారావు, విజయరాణి, పద్మ, చల్లంగి జ్ఞానేశ్వరి, పూర్ణచంద్రరావు, లక్ష్మణ్, బేతాలుడు, ఆనంద్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

గోదావరిలో స్థానికేతరుల చేపల వేట

ఏ.వీరవరం కేంద్రంగా రూ. లక్షల్లో వ్యాపారం

దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టులోని బ్యాక్ వాటర్‌లో స్థానికేతర మత్స్యకారులకు అక్రమ చేపల వేట కాసుల వర్షం కురిపిస్తోంది. దేవీపట్నం మండలంలో ఈ చేపల వేట కొన్ని రోజులుగా జోరుగా సాగుతోంది. గండిపోశమ్మ ఆలయానికి కొద్ది దూరంలో గోదావరి నదీ మధ్యలో ఎగువ కాఫర్ డ్యామ్ ఉంది. ఈ నేపథ్యంలో గోదావరి పై భాగంలో చేపలు పెరిగిపోవడంతో బయటి ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారుల కళ్లు దేవీపట్నంపై పడింది. పెద్ద వలలు, పడవలతో అనేకమంది ఏ.వీరవరం వద్ద నిర్వాసితులు ఖాళీ చేసిన ఇళ్లలో చేపల నిల్వకు భారీగా ఏర్పాట్లు చేశారు. రాత్రి, పగలు గోదావరిలో చేపలు వేటాడటం వాటిని ఐస్ ప్యాక్ చేసి బయటి ప్రాంతాలకు వాహనాలపై తరలించేస్తున్నారు.



ఏ.వీరవరం కేంద్రంగా స్థానికేతర మత్స్యకారుల చేపల వేట

చిన్న చేపలను వదలడం లేదు?

గోదావరిలో వరద తగ్గుతున్న నేపథ్యంలో దండంగి, ఏ.వీరవరం, దేవీపట్నం, ఏనుగులగూడెం, గబ్బులంపాలెం, గానుగులగొంది పరిసర ప్రాంతాల్లో జోరుగా చేపలు పడుతున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికేతర మత్స్యకారుల వద్ద భారీగా వలలు ఉండటంతో చిన్న చేపలను సైతం వదలడం లేదని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ముంపు గ్రామాల్లోని మత్స్యకారులతోపాటు ఏళ్ల తరబడి గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో జీవనాధారంగా ఉన్న గిరిజనులు మాత్రమే చేపల వేటకు అర్హులు. ఇలా కాకుండా కొవ్వూరు, నర్సీపట్నం నుంచి వచ్చిన మత్స్యకారులు ఏ.వీరవరం వద్ద అంబేడ్కర్ రహదారిపై గుడారాలు, సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుని చేపల వేటను కొనసాగిస్తున్నారు. స్థానికేతర మత్స్యకారులు గోదావరిలో చేపల వేటలు నిర్వహించడంపై ముంపు గ్రామాల నిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా కొంతమంది వ్యక్తుల అండతో వారంతా ఈ ప్రాంతంలోని చేపల వేట కొనసాగిస్తున్నారు.

పోలీస్ స్టేషన్ వరకే అనుమతి..

గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి దేవీపట్నం పోలీస్ స్టేషన్ వరకు మాత్రమే మత్స్యకారులు చేపల వేటకు అనుమతులు ఉన్నాయని గోకవరం రేంజ్ అధికారి దుర్గామహేశ్ 'న్యూస్‌టుడే'కి తెలిపారు. పోలీస్ స్టేషన్ పై నుంచి పాపికొండల వరకు అభయారణ్య పరిధి కావడంతో ఎవరికీ అనుమతులు ఉండవని, నిబంధనలు ఉల్లంఘించి వేటకు వెళ్తే చర్యలుంటాయన్నారు.

చిన్నచేపల వేట నిషేధం

గోదావరిలో చిన్నచేపల వేట పూర్తిగా నిషేధమని మత్స్యశాఖ ఇన్‌ఛార్జి అభివృద్ధి అధికారి జె. సీతారామరాజు చెప్పారు. స్థానికేతర మత్స్యకారులకు ఈ ప్రాంతంలోని చేపల వేటకు అనుమతులు లేవన్నారు. నిషేధిత వలలతో చిన్నచేపల వేట కొనసాగిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

– జె.సీతారామరాజు, మత్స్యశాఖ ఇన్‌ఛార్జి అభివృద్ధి అధికారి, పాడేరు





మైదాన ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా బాక్సులు, వలలతో సహా రోడ్డులపై గుడారాలు

సంక్షేమమే లక్ష్యంగా వంద రోజుల పాలన



అమనగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

హుకుంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల క్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు పేర్కొన్నారు. మండలంలోని పట్టం పంచాయతీ అమనగిరిలో ఇదే మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, 100 రోజుల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం పంచాయతీల నిధులు స్వాహా చేస్తే, కూటమి ప్రభుత్వం పంచాయతీలకు సుమారుగా రూ.950కోట్లు నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఎంపీడీవో వెంకటరావు, తెదేపా మండల అధ్యక్షుడు కుంతేసురావు మూరి తారకరామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసరావు, మఠం విజయభాస్కర్, సర్పంచి కొర్రా భద్రమ్మ, మండల తెదేపా నాయకులు కిలారు వెంకన్న, నజ్జాల శ్రీకాంత్, వైస్ ఎంపీపీ స్వర్ణ రావు, తమన్నా, రామానందసింగ్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: కూటమి వంద రోజుల పాలన అభివృద్ధి పథంలో నడిచిందని తెదేపా మండలాధ్యక్షుడు కొండలరావు తెలిపారు. జి.మాడుగులలోని పాత రెవెన్యూ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. తెదేపా ప్రధాన కార్యదర్శి కల్యాణం, నాయకులు కె.భీంబాబు, రెడ్డిబాబు, కొండబాబు, రమేష్ పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉంటుందో 100 రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసి నిరూపించారని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. మండలంలోని నెల్లిపాక, పురుషోత్తపట్నం గ్రామాల్లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గ్రామసభలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలంలో నెల కొన్న సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పురుషోత్తపట్నంలో దివంగత నంద

అనంతగిరి (గ్రామీణం), న్యూస్‌టుడే: కాశీపట్నం, వాలసి, రొంపల్లి పంచాయతీల్లోని గిరిజన గ్రామాల్లో వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాశీపట్నంలో గ్రామ కార్యదర్శి వరలక్ష్మి నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచి జనపరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ముతిభోయిన సన్యాసిరావు, వార్డు సభ్యులు బ్రోచర్లను ఆవిష్కరించారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొర్రాయిలో ఆ పంచాయతీ సర్పంచి కొములు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. 100 రోజుల ప్రభుత్వ పాలనను ఇంటింటికెళ్లి గిరిజనులకు వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు తడుము సుబ్బారావు, మాజీ సర్పంచి వెంకటరాజు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, భాజపా నాయకుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కాశీపట్నంలో కరపత్రాలతో ప్రచారం

పర్యటక ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాల్లో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా పటిష్ఠమైన జాగ్రత్తలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఏడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పర్యటక, అటవీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో పీవో సింహాచలం సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కమిటీగా ఏర్పడి పర్యటక కేంద్రాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై నివేదిక సమర్పించాలన్నారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ఎక్కడికక్కడ కేసులు నమోదు చేయాలన్నారు. రూ.500 జరిమానా విధించాలన్నారు. పర్యటక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పహారా కాయాలన్నారు. వాగుల చుట్టూ కంచెల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలన్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పర్యటకులు ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయకుండా బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యటక శాఖ డైరెక్టర్ స్వామినాయుడు, అసిస్టెంట్ మేనేజర్ రంగబాబు, సబ్ డీఎఫ్‌వో శ్రీరాములురావు, ఐటీడీఏ ఈఈ శ్రీనివాసరావు, డీఎల్‌పీవో అబ్బులు, తహసీల్దార్లు కృష్ణజ్యోతి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, అనసూయ, సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవోలు యాదగిరీశ్వరరావు, జయంతి, ఈవోపీఆర్‌డీ జాన్‌మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

త్వరలో నిర్వాసితులకు న్యాయం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, కాస్త ఓపిక పడితే.. క్రమపద్ధతిలో పరిహారం అందించి, వరద ముంపు కష్టాల నుంచి తప్పిస్తామని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి పేర్కొన్నారు. మండలంలోని రామవరం, వడ్డిగూడెం పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. గడిచిన అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను కనీసం పట్టించుకోలేదన్నారు. దాని ఫలితంగానే విలీన మండలాల ప్రజలకు వరద కష్టాలు మిగిలాయన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో పోలవరం నిర్మాణంతోపాటు, నిర్వాసితుల పరిహారం, పునరావాసం ఏర్పాటు చేస్తామని వివరించారు. ముంపు గ్రామాల్లో పోలవరం సర్వేల్లో నెలకొన్న సమస్యలను అధికారులతో మాట్లాడి, పరిష్కరిస్తామన్నారు. ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. స్థానిక వ్యవసాయశాఖ మండల అధికారి రఘు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. సాగులో రైతులకు విలువైన సమాచారం, సలహాలు ఇవ్వాలన్నారు. చింతరేవుపల్లిలో తెదేపా నాయకులతో మాట్లాడి వరద బాధితుల పరిస్థితిపై ఆరా తీశారు. తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట శ్రీను, కన్నారావు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వడ్డానపు భాగ్యలక్ష్మి, బొర్రా నరేశ్, జనసేనా మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, ఇన్‌ఛార్జి తహసీల్దార్ సుబ్బారావ పాల్గొన్నారు. ఎటపాక సీఐ కన్నపరాజు బందోబస్తు నిర్వహించారు. చేశారు.



వీఆర్‌పురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరిషాదేవి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

పాడేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఆందోళన చేశారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా అక్కడికి చేరుకుని వసతి గృహాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని నినాదాలు చేశారు. కలెక్టర్ తక్షణమే వచ్చి సమాధానం చెప్పాలని ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు కార్తిక్ శ్రీను మాట్లాడుతూ ఉపకార వేతనాలు మంజూరు, విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆశ్రమ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థిని చనిపోతే స్పందించని వార్డెన్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలు నివారించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. బాలుర, బాలికల వసతి గృహాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పూజారి లక్ష్మీప్రియ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌కు చికిత్స పొందుతూ ఈ నెల 22న చనిపోయింది.



కలెక్టరేట్ ముట్టడించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులుతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అరకు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా చలపతిరావు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ పట్టాసి చలపతిరావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన రామకృష్ణ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి చలపతిరావును పూర్తిస్థాయి ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాయక్, ఆయా కళాశాలల అధ్యాపక సిబ్బంది నూతన ప్రిన్సిపల్ చలపతిరావుకు అభినందనలు తెలిపారు.



చలపతిరావును అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాయక్, మహిళా కళాశాల అధ్యాపక సిబ్బంది

గిరిజన సంక్షేమశాఖ ఈఈగా శ్రీనివాసరావు



రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా **ఐ.శ్రీనివాసరావు** మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ డీఈఈగా పనిచేస్తూ రంపచోడవరం బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌ఛార్జి ఈఈగా పనిచేసిన డేవిడ్ రాజు బుట్టాయిగూడెం సబ్ డివిజన్‌లో డీఈఈగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలను ఈఈ మర్యాద పూర్వకంగా కలిశారు.

అభివృద్ధి పనులు గడువులోపే పూర్తి చేయాలి

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పాడేరు డివిజన్ అధికారులతో ప్రత్యక్షంగా, రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌తో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మల్టీపర్పస్ భవనాలు, జన్‌మన్ పథకంలో మంజూరు చేసిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణాలు, గోకులం షెడ్లు, సీసీడీపీ పనులన్నింటికీ నిధులు వస్తాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాడేరు డివిజన్ ఏడు బర్త్ వెయిటింగ్ భవనాలు, అరకు వ్యాలీ డివిజన్‌లో ఏడు భవనాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి 170 పనులు మంజూరు కాగా, 45 పనులు పూర్తి చేశారని మిగిలిన పనులు నవంబర్ నెలాఖరికి పూర్తి చేయాలని ఆదేశించారు. 72 బీటీ రోడ్లలో 14 పూర్తి చేశారని మిగిలినవి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. పాడేరు పీఐయూ విభాగంలో 28కి 6 పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 22 సీసీ రోడ్లకు 12 వేగవంతం చేయాలని చెప్పారు. రహదారులు భవనాల శాఖకు రూ. 1.38 కోట్లతో 26 పనులు అప్పగించినట్లు చెప్పారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లను డిసెంబరుకు, ఎస్‌ఎంఐకి మంజూరైన 146 పనులను మార్చికి పూర్తి చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ

క్యూఆర్ కోడ్‌తో ప్రజాస్పందన సేకరణ

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజల నుంచి సేకరించిన స్పందనను నమోదుచేయాలని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం, నైపుణ్యం గల యువత, అందరికీ ఆరోగ్యం, సుసంపన్నమైన సమాజం ఉండాలని కోరుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 దార్శిక ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు.

పర్యాటక సేవలపై ప్రజలకు అవగాహన

అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాఠశాలలో టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శానిటేషన్ పనులు చేసేటప్పుడు స్థానిక వ్యాపారులు, వాణిజ్య సంస్థలు, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమాలను అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారానికి అధికారులు చొరవ చూపించాలని స్పష్టం చేశారు. జేసీ అభిషేక్ గౌడ, పీఆర్ ఈఈ కొండయ్యపడాల్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాజు, వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు, పర్యటక శాఖాధికారి దాసు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కులో ప్రమాదం.. అధికారికి గాయాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం ఎస్‌ఎంఎస్-1(స్టీల్ మెల్టింగ్ షాప్-1) లాడిల్ ప్రిపరేషన్ బే(ఎల్‌పీ బే)లో మంగళవారం జరిగిన ప్రమాదంలో సీనియర్ మేనేజర్ సీహెచ్.మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కార్మిక నాయకులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం కంట్రోల్ రూమ్‌లో పని చేసే ఉద్యోగి హాజరు కాకపోవడంతో, ఉదయం ఏ-షిఫ్ట్ విధులకు వెళ్లిన మల్లేశ్వరరావు అక్కడి పనులు పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి హాట్‌మెటల్ (సుమారు 1500 డిగ్రీల వేడితో.) ఎస్‌ఎంఎస్‌కు వచ్చింది. ట్రాన్స్‌ఫర్ కార్ నుంచి నేరుగా కన్వర్టర్‌లో పోసిన మెటల్‌కు వివిధ మిశ్రమాలు కలిపారు. తర్వాత లాడిల్‌లో పోసి మౌల్డింగ్ యూనిట్‌కు తరలించే క్రమంలో మెటల్ ఒక్కసారిగా పేలిపోయింది. భారీ శబ్దం రావడంతో ఏం జరిగిందోనని... కంట్రోల్ రూమ్‌లో ఉన్న మల్లేశ్వరరావు బయటకు వస్తుండగా... కాలికి ఇనుప రాడ్డు తగిలి కింద పడిపోయారు. పేలిన హాట్ మెటల్ ఆయనపై పడడంతో 90 శాతంపైగా శరీరం కాలిపోయింది. తోటి కార్మికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

కస్తూర్బా పాఠశాలలో జీసీడీవో తనిఖీలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా పాఠశాలను జీసీడీఓ సూర్యకుమారి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. సాంబారు, మజ్జిగ పలుచగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తేదారు పప్పు సరఫరా చేయకపోవడంతో సాంబారుకు బదులు తక్కువ పప్పుతో రసం తయారు చేయించినట్లు సిబ్బంది తెలిపారు. విశాఖ టెట్రాకు బదులు గుడ్‌డే పాల ప్యాకెటు ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై మండిపడ్డారు. సకాలంలో సరకులు పంపిణీ చేయకపోవడంపై గుత్తేదారుతో మాట్లాడుతానని జీసీడీఓ తెలిపారు. ఏవి తక్కువైనా వెంటనే తనకు ఎందుకు తెలియజేయలేదని స్థానిక ఎస్‌ఓ పరిమళను ఫోన్‌లో ప్రశ్నించారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జీసీడీవో సూర్యకుమారి

ఆ మూడు పంచాయతీలకు పరిహారమివ్వాలని వినతి

కూనవరం, న్యూస్‌టుడే: గోదావరి వరద నష్ట పరిహారాన్ని చూచిరేవుల గూడెం, కూటూరు, పెదార్కూరు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఇవ్వాలని సీపీఎం ప్రజా ప్రతినిధులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వరదల సమయంలో ఆ పంచాయతీలోని ప్రజలకు నిత్యావసరాలు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. ఆ మూడు పంచాయతీలకు నిత్యావసరాలతోపాటు రూ.పది వేలు ఇవ్వాలని కోరారు. వైస్ ఎంపీపీ పెంటయ్య, సర్పంచులు నాగమణి, వెంకమ్మ, ఎంపీటీసీ సభ్యులు అమ్మాజీ, జయసుధ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం చేపట్టాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: సోములగూడెం నుంచి వీరపాపన కుంట వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు పులి సంతోశ్ డిమాండ్ చేశారు. లక్ష్మీనగరంలో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో సంతోశ్ మాట్లాడారు. ఈ రహదారి నిర్మాణంతో ఐదు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. లక్ష్మీనగరం - సోములగూడెం రహదారిని సీసీ రోడ్డుగా మార్చి, డ్రైనేజీలు నిర్మించాలన్నారు. తునికాకు కార్మికులకు అటవీశాఖ అధికారులు చెల్లించాల్సిన బోనస్‌ని విడుదల చేయాలన్నారు. చిన్నబాబు, సున్నం రాజులు, బొజ్జి, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాగు పొంగి నిలిచిన రాకపోకలు



వరదలో కొట్టుకుపోయిన బైక్‌ను తీసుకువస్తున్న స్థానికులు



నిలిచిన రాకపోకలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మంగళవారం అమ్మిరేకుల-కిమ్మిలిగెడ్డ మధ్య వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉద్ధృతి తగ్గింది అనుకుని ఒక యువకుడు మరో ముగ్గురి సాయంతో ద్విచక్ర వాహనాన్ని దాటవేస్తుండగా ప్రమాదవశాత్తూ అందరూ కొంత దూరం కొట్టుకుపోయి క్షేమంగా ఒడ్డుకు చేరారు. ద్విచక్ర వాహనం సమీపాన ఉన్న పొదల్లో చిక్కుకుంది. ఉద్ధృతి తగ్గిన తరువాత వాహనాన్ని బయటకు తీశారు. వాగుకు కొద్ది దూరంలో రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. స్థానికులు చెట్ల కొమ్మలను తొలగించడంతో రాకపోకలు సాగాయి.

గురుకుల కళాశాలలో అదనపు వసతులు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలోని ఏపీ గురుకుల బాలుర కళాశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు సమకూరుస్తామని అమరావతి నుంచి వచ్చిన గురుకుల కళాశాలల విభాగం తనిఖీ అధికారి రంగారావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఏపీ గురుకుల కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ రామేశ్వరం, అధ్యాపకులు పాల్గొన్నారు.



కళాశాలను సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడుతున్న తనిఖీ అధికారి రంగారావు

ఉమ్మడి జిల్లా కుస్తీ ఎంపిక పోటీలు 26న

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు బాలురు-1 ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో రెజ్లింగ్ అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు స్థానిక కుస్తీ శిక్షణ కేంద్రం పీడీ అంబటి నూకరాజు తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను పోటీలకు తీసుకురావాలని ఉమ్మడి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన కోరారు.

26న కంటి వైద్య శిబిరం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునే లబ్ధిదారులు ఆధార్‌కార్డు నకలులతో హాజరు కావాలన్నారు. డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు

వరంగల్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం పట్టుకున్న గంజాయి కేసు వివరాలను వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దిల్లీ, బిహార్‌కు చెందిన వివేక్ కుమార్ మిశ్రా, ధర్మేందర్ మలాకర్, బాబీ దేవి, ద్రౌపతి, రీతికలతో కూడిన అయిదుగురు సభ్యుల ముఠా.. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రావాణా చేయాలని నిర్ణయించుకున్నారు. దిల్లీ నుంచి విశాఖపట్నం వెళ్లారు. అక్కడ గంజాయి వ్యాపారం చేస్తున్న రవిని కలిశారు. అతడు గంజాయిని దిల్లీలోని అరవింద్‌కు ఇచ్చి వస్తే రూ.50 వేలు ఇస్తానని ముఠా సభ్యులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 21న విశాఖపట్నం నుంచి నాలుగు సంచుల్లో 27.41 కిలోల గంజాయి తీసుకున్న ముఠా సభ్యులు నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో దిల్లీకి బయల్దేరారు. 22న ఉదయం రైలు కాజీపేటకు చేరుకోగా.. పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ విషయం గమనించి.. గంజాయి సంచులతో రైలు దిగి రోడ్డు మార్గంలో వర్ధన్నపేట బస్టాండ్‌కు చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు బస్టాండ్‌లో తనిఖీ చేపట్టారు. గంజాయితో సహా ముఠా సభ్యులను పట్టుకున్నారు. వివేక్ కుమార్ మిశ్రా, ధర్మేందర్ మలాకర్, బాబీ దేవి, ద్రౌపతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. రీతిక, రవి, అరవింద్‌లు పరారీలో ఉన్నట్లు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

చింతూరు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చట్టిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. అవివాహితుడైన చట్టికి చెందిన తుర్రం పెంటయ్య (58) మద్యం మత్తులో మతి స్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి అధికంగా మద్యం తాగిన అతడు గ్రామంలోని మామిడి చెట్టుకు తువ్వాలుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహానికి చింతూరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బురదలో కూరుకుపోయిన బస్సు

సీలేరు, న్యూస్‌టుడే: పాడేరు నుంచి దొంకరాయి వస్తున్న ఆర్టీసీ బస్సు గూడెంకొత్తవీధి మండలం లంకపాకలు వద్ద బురదలో కూరుకుపోయింది. మంగళవారం పాడేరు డిపోకు చెందిన ఏపీ 31జడ్0311 నంబరు ఎక్స్‌ప్రెస్ బస్సు పాడేరు నుంచి దొంకరాయి బయలుదేరింది. లంకపాకలు వద్ద వంతెన పనులు జరుగుతుండడంతో ఇటీవల కురిసిన వర్షానికి రహదారి అంతా బురదమయమైంది. బస్సు బురదలో కూరుకుపోవడంతో సుమారు గంటపాటు ప్రయాణికులు, అక్కడ పనులు చేస్తున్న సిబ్బంది శ్రమించి బస్సును బయటకు తీశారు. ఈ బస్సు గమ్యస్థానానికి గంట ఆలస్యంగా చేరుకుంది.



దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలులో ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో ఇరువర్గాలకు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె రమణ తెలిపారు. స్థానికంగా ఉండే ఉపాధ్యాయుడిపై ఒక వర్గానికి చెందిన వ్యక్తులు ఆదివారం దాడి చేయడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఫిర్యాదుచేసిన ఉపాధ్యాయుడి సంబంధీకులు మరో ఉపాధ్యాయుడి కొడుకు కోడలిపై మంగళవారం సాయంత్రం దాడి చేయడంతో వారి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడి ఘటనలో ఉపాధ్యాయుని కోడలు గర్భిణి కావడంతో ఆమెపై దాడి చేయడంతో ఆర్యోగ పరిస్థితి క్షీణించిందని, ఆమెను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్‌డ్	187	206
స్కిన్‌లెస్	213	216



ఖోఖో పోటీల్లో పాల్గొన్న బాలికలు

క్రీడలతో మానసికోల్లాసం

అరకులోయ, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహనరావు అన్నారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను స్థానిక క్రీడా పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన ప్రారంభించారు. మొత్తం 612 మంది విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో తలపడ్డారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొండబాబు, మాజీ కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్యానికి ముప్పు

చింతూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ విజయగౌరి ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అమ్మాయిలు మానసికంగా, శారీరకంగా శక్తిని కోల్పోతూ ఆరోగ్యపరంగా నష్టపోతారన్నారు. ఈ వయస్సులో శ్రద్ధగా చదువుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి. ప్రియాంక మాట్లాడుతూ మగ పిల్లలు త్వరగా పెళ్లి చేసుకోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు వస్తాయని, వాటిని ఎదుర్కోలేక వ్యసనాలకు అలవాటు పడతారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎలిజబెత్, పార్వతి, రాజు, రవి పాల్గొన్నారు.

చిన్నపని.. వీడని అలసత్వం

పూర్తికాని రహదారి నిర్మాణం

రంపచోడవరం, న్యూస్‌టుడే:

మూడు మండలాల ప్రజలకు ఉపయోగపడే రహదారి. ప్రభుత్వం దీని నిర్మాణానికి అవసరమైన నిధులిచ్చింది. అటవీశాఖకు చెల్లించాల్సిన మొత్తాన్ని రోడ్లు భవనాల శాఖ అధికారులు చెల్లించారు. ప్రత్యామ్నాయ భూమిని చూపించారు. అయితే చూపించిన భూమికి సర్వే నంబరు నమోదు చేయడంలో ఏడాదిగా అలసత్వం వహిస్తున్నారు. ఫలితం.. రహదారి నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో మూడు మండలాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గత నెల 28న 'ఈనాడు'లో 'అయిదేళ్లయినా అసంపూర్తే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది.



అటవీఅధికారులకు పరిహారం చెల్లించినా పూర్తిచేయని పందిరిమామిడి-చవిటిదిబ్బల మార్గం మధ్యలో రోడ్డు

రంపచోడవరం మండలం పందిరిమామిడి నుంచి వై.రామవరం మండలం చవిటిదిబ్బల వరకు బీటీ రోడ్డు పనులను రహదారులు భవనాల శాఖ చేపట్టి అయిదేళ్లయినా నేటికి పూర్తికాలేదు. పందిరిమామిడి నుంచి డి.భీమవరం వరకు నిర్మించి.. ఇక్కడి నుంచి వాడపల్లి వరకు కేవలం ఆరు కిలోమీటర్ల మేర అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయింది. ఈ రహదారిలో రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లోని గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తారు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వ హయాంలో 29 కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులకు రూ. 30 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల మేరకు రోడ్డు మెటల్‌పరచి వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం చెల్లించినా...

పందిరిమామిడి - చవిటిదిబ్బల రహదారి నిర్మాణంలో భాగంగా అటవీ అభ్యంతరాలతో నిలిచిన రోడ్డుకు నష్టపరిహారం కింద ర.భ.శాఖ అధికారులు రూ.90లక్షలు అటవీశాఖకు ఏడాది క్రితం చెల్లించారు. అయినా చిన్న సాంకేతిక సమస్యతో రోడ్డు పనులు పునఃప్రారంభించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పరిహారం చెల్లించి ఏడాది కావస్తున్నా నేటికి అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టలేదని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు.

సర్వే నెంబరు ఇచ్చిన వెంటనే పనులకు అనుమతి

మూడు మండలాలకు ప్రయోజనం కలిగే పందిరిమామిడి-చవిటిదిబ్బల బీటీ రోడ్డు నిర్మాణంలో అటవీశాఖకు చెందిన కొంతభూమిని కోల్పోతున్నాం. దీనికి సంబంధించి పరిహారం కింద ర.భ.శాఖ అధికారులు రూ.90 లక్షలు ప్రభుత్వానికి చెల్లించారు. దీంతోపాటు రోడ్డు నిర్మాణంలో నష్టపోయిన భూమికి అదనంగా మరోచోట చూపించాల్సి ఉంది. ఆ భూమిని ర.భ.శాఖ ఇంజినీరింగ్ అధికారులు చూపించారు. అయితే చూపించిన భూమికి సర్వే నెంబరు లేదు. సర్వే నెంబరును కేటాయించాలని ఇంజినీరింగ్ అధికారులు భూ సేకరణ ఛీఫ్ కమిషనర్‌కు నివేదిక పంపించారు. సర్వే నెంబరు ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు అనుమతులు ఇస్తాం.

– కరుణాకర్, రేంజి అధికారి, ఫోక్సుపేట

త్వరలో పూర్తి చేస్తాం

పందిరిమామిడి - చవిటిదిబ్బల రహదారిని నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇప్పటికే గ్రామసభల్లో గిరిజనులు నాకు విన్నవించారు. ఉన్నతాధికారులతో చర్చించి వేగవంతంగా పూర్తి చేస్తాం.

– కట్టా సింహాచలం, ఐటీడీఏ పీవో, రంపచోడవరం

ఉపాధ్యాయుడిని నియమించరూ..

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ పరిధిలోని జామిగుడ పాఠశాల పునఃప్రారంభం నుంచి ఉపాధ్యాయులు లేకపోవడంతో బాషా వాలంటీరే పాఠాలు చెబుతున్నారు. శాశ్వత ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో జామిగుడ, కమలాపురం గ్రామాలకు చెందిన 31 మంది బాలలు చదువుతున్నారు. అధికారులు స్పందించాలని గ్రామస్థులు దొన్ను, రామన్న తదితరులు కోరుతున్నారు.



జామిగుడ పాఠశాల వద్ద విద్యార్థులు

అవీ ఇవీ

లడ్డూ తయారీపై సీబీఐతో విచారణ చేయాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో కోట్లాది మంది భక్తులకు ప్రసాదం కింద ఇచ్చే లడ్డూను అపవిత్రం చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దీనిపై సీబీఐతో విచారణ చేయించి బాధ్యులైన ప్రజా ప్రతినిధులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యల వల్ల కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన విజయవంతం చేయాలని, పాడేరులో ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి కిల్లో మోస్య తెలిపారు. మండలంలోని ఒప్పంద, పొరుగు సేవలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ ధర్నాకు హాజరు కావాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కార్మికులకు లేఖలు అందజేశారు.

ఏచూరి మరణం దేశానికి తీరనిలోటు

చింతపల్లి, న్యూస్‌టుడే: సీపీఎంలో దిగ్గజ నేత సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. పెదబరడ పంచాయతీ చింతలూరులో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు సంబంధించి సీపీఎం కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ముందు ఏచూరికి నివాళులర్పించారు. సీతారాం జ్ఞాపకాలతో పలు పత్రికల్లో ముద్రించిన కథనాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం దేశంలో జమిలి ఎన్నికలు ఏమాత్రం మంచిది కాదని చిన్నయ్యపడాల్ అన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రధాన కార్యదర్శులు పాంగి ధనుంజై, సాగిన చిరంజీవి, కిలో సింహాచలం, ముర్లరామారావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రహదారి

పాడేరు, న్యూస్‌టుడే: డి.గొందూరు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారుడు బురదలో జారిపడి తీవ్ర గాయాలయ్యారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో ద్విచక్రవాహనం బురదలో కూరుకుపోయి వాహనదారుడు గాయపడ్డారు. గాయాలైన వాహనదారుడిని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పొందుతున్నారు.

మృతదేహం తరలింపునకు అంబులెన్స్ సమకూర్చిన ఎమ్మెల్యే

అడ్డతీగల, న్యూస్‌టుడే: అడ్డతీగల ప్రభుత్వాసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందింది. మృతదేహాన్ని దూర ప్రాంతాలకు తరలించడానికి ఆ సమయంలో స్థానికంగా ఎటువంటి వాహనాలు అందుబాటులో లేకపోవడంతో స్థానిక కూటమి నాయకులు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్‌కు సమాచారం చేరవేశారు. వెంటనే స్పందించి సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో మృతురాలిని ఆమె స్వగ్రామానికి తరలించారు. కూటమి నాయకులు అక్కపల్లి పండు, ఎడ్ల శ్రీను, కుప్పాల జయరాం, పొడుగు సాయి తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో యువత భాగస్వాములు కావాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, చలపతిరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ డేను ఆయా కళాశాలల్లో వేర్వేరుగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన 5కె రన్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓలు విజయలక్ష్మి, అనితకుమారి, నాగబాబు, వైస్ ప్రిన్సిపల్ పుష్పరాజ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీను విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంగమ్మ విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహాలక్ష్మి, ఉపన్యాసకులు డాక్టర్ శ్రీనివాస్, బి.కుమారి, పుష్ప, వెంకటరమణ, శేఖర్ పాల్గొన్నారు.



మర్రిపాలెంలో విద్యార్థినుల ర్యాలీ

విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలు పెంచాలి

జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభా సామర్థ్యాలు పెంచేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు సూచించారు. జోలాపుట్టు, లబ్బూరు, పనసపుట్టు గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠ్యప్రణాళిక, దినచర్య కచ్చితంగా రాయాలని ఉపాధ్యాయులకు సూచించారు. లబ్బూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొక్క నాటారు. ఎంఈఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



లబ్బూరు పాఠశాలలో మొక్క నాటుతున్న డీఈఓ బ్రహ్మాజీరావు

పన్నెండేళ్లుగా అవే అంబులెన్సులు

మన్యంలోని చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పన్నెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన అంబులెన్సులనే నేటికీ వినియోగిస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నాటి గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జైరాం రమేష్ తన ఎంపీ నిధులతో ఏజెన్సీ ప్రాంతంలోని 33 పీహెచ్‌సీలకు వాహనాలు సమకూర్చారు. నేటికీ వాటినే వాడాల్సిన పరిస్థితి. ముంచంగిపుట్టు మండలంలోని లబ్బూరు, కిలగాడ, రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మూడు అంబులెన్సులు వినియోగిస్తున్నారు. పాడేరు ఐటీడీఏ నియమించిన డ్రైవర్లు వాహనాలు నడిపి ఉపాధి పొందుతుండగా... ఇంధనం ఖర్చులను ఐటీడీఏ అందిస్తోంది. కొనుగోలు చేసి దశాబ్దం పైగా పూర్తవడంతో వాహనాల పైభాగం తుప్పు పట్టింది. కొన్ని పీహెచ్‌సీల్లో వాహనాలు మూలకు చేరాయి. టైర్లు ఛిద్రమై నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. గ్రామాల్లో వైద్యసేవలు విస్తరించేందుకు ప్రతి పీహెచ్‌సీకి కొత్త అంబులెన్సు కొనుగోలు చేయాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వినియోగిస్తున్న అంబులెన్సు

ఇన్ సర్వీసు కోటా తగ్గించడం దారుణం



నరసాపురం పీహెచ్‌సీలో నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోస్టు గ్రాడ్యుయేషన్ ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించడం వల్ల తీవ్ర అన్యాయానికి గురవుతారని వైద్యసిబ్బంది పేర్కొన్నారు. నరసాపురం పీహెచ్‌సీలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైద్యసిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో వైద్యుల సమ్మెకు సంఘీభావంగా మంగళవారం నిరసన తెలిపారు.

సమగ్ర సస్యరక్షణ విధానాలు ఆచరించాలి

చింతపల్లి, కొయ్యూరు, న్యూస్‌టుడే: గిరిజన రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉజ్వలారాణి అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం చింతపల్లి మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో జరిగింది. ప్రకృతి వ్యవసాయ విధానాలు, కషాయాల తయారీ వాటి వినియోగంపై వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి వెంకటరమణ వివరించారు. పశువైద్యాధికారి దమయంతి పాల్గొన్నారు. రావణాపల్లి, కొండగోకిరి గ్రామాల్లో ఏఓ ఉమాదేవి ఆధ్వర్యంలో రైతులు వరి పొలాలను పరిశీలించారు. పశువైద్యాధికారి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

హుకుంపేట, మంచంగిపుట్టు: మఠం పంచాయతీ ఎం.బొడ్డాపుట్టులో వ్యవసాధికారిణి లీలావతి, సర్పంచి శాంతికుమారి, వ్యవసాయ సిబ్బంది ప్రియాంక, కల్యాణి, బీజేవైఎం నేత మత్స్య కొండబాబు రైతులతో సమావేశమయ్యారు. ముంచంగిపుట్టు మండలంలోని మాకవరం, పనసపుట్టు పంచాయతీల్లోని ఒంటిపుట్టు, కుంబిరిపడ గ్రామాల్లో రాగి, సామ, వరి పొలాల్లోకి రైతులను తీసుకుని వెళ్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వివరించారు. వ్యవసాయశాఖ మండల అధికారి శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

కూనవరం, చింతూరు: కూనవరంలో పొలం పిలుస్తోంది గోడపత్రికలను ఎంపీపీ పాయం రంగమ్మ, ఏవో శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. సర్పంచి మల్లంపల్లి హేమంత్, తహసీల్దార్ నాగబాబు పాల్గొన్నారు. చినార్కూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీ విత్తనాలను సర్పంచి సున్నం రాంబాబు అందించారు. చింతూరు మండలం కుమ్మూరు, మామిళ్ళగూడెం, చట్టి గ్రామాల్లో ఏఓ శ్రీనివాసరావు రైతులకు సూచనలు చేశారు.

రంపచోడవరం: ఊట్ల, బి.వెలమల కోట గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి చౌదరి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ మాట్లాడుతూ గిరిజన రైతులకు తేనె టీగలు, పుట్టగొడుగులు పెంపకంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సర్పంచి ముర్రం లక్ష్మి, ఉప ఎంపీపీ పండా లక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త వీరాంజనేయులు, భూపతిపాలెం కెనాల్ డీఈ శ్రీనివాస్, వ్యవసాయాధికారులు కె.లక్ష్మణ్, పశు వైద్యాధికారి విక్కీ రాయ్, రైతులు పాల్గొన్నారు.

గంగవరం, రాజవొమ్మంగి: జడేరు, మోహనాపురం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ కె.విశ్వనాథ్ ఆధ్వర్యంలో అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, తెదేపా రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ పాల్గొన్నారు. రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో ఏఓ రమేష్ నాయుడు వరి పొలాలను పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.



కొత్తపాలెంలో రైతులకు సూచలు చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు



మోహనాపురంలో కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో తదితరులు

దసరా ఉత్సవాలకు పాలరాట

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: శ్రీరామగిరిలో మంగళవారం దుర్గమ్మ నవరాత్రి ఉత్సవ మండప నిర్మాణానికి గురుభవానీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకర్రను ముహూర్తపు స్తంభం వేసి, హారతుల పట్టారు. అనంతరం ఉత్సవ మండపానికి అవసరమైన పందిళ్లు వేశారు. కాంతారావు, దుర్గారావు, సత్యనారాయణ, గుండెపూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండలో దసరా ఉత్సవాలకు మంగవారం ముహూర్తపు రాట వేశారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు, స్థానిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అక్టోబర్ 3 నుంచి దేవీ శరన్నవరాత్రి 11వ వార్షిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు, ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



శ్రీరామగిరిలో పూజలో మహిళలు

పాఠశాలకు తాగునీటి శుద్ధీకరణ యంత్రం వితరణ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తాజంగి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి బొర్రా నూకరాజు తాను చదువుకున్న పాఠశాలకు తాగునీటి శుద్ధీకరణ యంత్రాన్ని అందించారు. దీనిని జనసేన నాయకులు సీతారాం, లక్ష్మణరావుల చేతులమీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారికి సన్మానం

పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ విజయనగరం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు మంగళవారం అల్లూరి జిల్లా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగులందరూ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పాడేరు, న్యూస్‌టుడే: కలెక్టర్ దినేష్‌కుమార్ ఇటీవల ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రత్యేక అధికారులు సంక్షేమ పథకాల నిర్వహణ తీరుపై పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలకు భిన్నంగా పాడేరులో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రత్యేక అధికారితోపాటు మండల స్థాయి అధికారులు కూడా హాజరు కాకపోవడం గమనార్హం. ఎంపీపీ రత్నకుమారి అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ సాయినవీన్, తహసీల్దార్ త్రినాథ్‌నాయుడు కొంతమంది అధికారులుమాత్రమే హాజరయ్యారు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు వచ్చాయి. దీంతో వారు అసహనం వ్యక్తం చేశారు. హాజరుకాని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. సీజన్ కావడంతో గ్రామాల్లో ఎక్కడ చూసిన దోమలు, పారిశుద్ధ్యం పేరుకుపోతున్నాయని పలువురు సర్పంచులు తెలిపారు. సచివాలయాల్లో రాయితీ రాజ్‌మా విత్తనాలు అందడంలేదని వ్యవసాయశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. స్వర్ణాంధ్ర 2047 గోడపత్రికలు ఆవిష్కరించారు. గోడపత్రికల క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఎంపీడీఓ సాయినవీన్ పేర్కొన్నారు.



మండలస్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రైతులకు ప్రత్యేక పథకాలు

గూడెంకొత్తవీధి: రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ చింతపల్లి సంచాలకురాలు(ఏడీఏ) జాహ్నవి సూచించారు. దుచ్చరిపాలెం, రింతాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులను చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా. బాల హుస్సేన్‌రెడ్డి వివరించారు. సర్పంచి లక్ష్మి, ఏఓ మధుసూదన్‌రావు, పశు వైద్యాధికారి డా. రాజశేఖర్ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషకాహారంతో రక్తహీనత నివారణ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే రక్తహీనత నివారణ సాధ్యమని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని సొవ్వా క్లస్టర్ పరిధిలోని ఒడియవలస అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ప్రత్యేకంగా పోషకాహార కల్పనకు చర్యలు చేపడుతుందని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల ఆరోగ్యాల మెరుగుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు విధిగా సందర్శించి పోషకాహారం పొందాలని ఆమె కోరారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల, కొయ్యూరు, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ సువర్ణమ్మ తెలిపారు. జి.మాడుగుల మండలం చిన్నబందవీధి సెకార్టు కొంతలంలో పోషకాహార మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. పోషకాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సామూహిక సీమంతాలు చేశారు. ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సింహాచలం, ఉపాధ్యాయురాలు శివరామలక్ష్మి, సూపర్‌వైజర్లు, విజయలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరు మాసాల నిండిన పిల్లలకు సీడీపీఓ విజయకుమారి ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకొంది. ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కొండమ్మ, సునీత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఒడియవలసలో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ

విద్యుత్తు సరఫరా లేక పాముల బెడద

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధి బురుగ గ్రామంలో సోమవారం రాత్రి సోమెల అప్పలరాజు ఇంట్లోకి పాము దూరడంతో అంతా భయాందోళన చెందారు. పడుకునేందుకు వీలుగా ఇంట్లోని దుస్తుల మూటలు పక్కకు తీస్తుండగా వాటి కింద నాగుపాము కనిపించింది. స్థానికులంతా అంతా కలిసి దీన్ని హతమార్చారు. గ్రామంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో అంతా చీకటిగా మారి ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తెలిపారు. గతంలో కూడా పాముకాటుకు ఒక వ్యక్తి మృతిచెందాడని తెలిపారు. విద్యుత్తు లైన్లు నెల రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు.. రెండు నెలలు అవుతున్నా ఇప్పటికీ సరఫరా ఇవ్వలేదని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వికసిత్ భారత్‌తో నైపుణ్యాలు వెలికితీత

కూనవరం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్‌తో యువతలోని నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని తహసీల్దార్ నాగబాబు అన్నారు. కూనవరంలో మంగళవారం ఆయన వికసిత్ భారత్ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా దేశానికి, యువతకు జరిగే మేలును వివరించారు. సర్పంచి మల్లంపల్లి హేమంత్, ఆర్ఐ జల్లి సత్యనారాయణ, కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం పంపిణీ

చింతూరు, న్యూస్‌టుడే: మండలంలోని వరద బాధితులకు సొపిడ్ సంస్థ డైరెక్టర్ మీరాఖాదర్ ఆధ్వర్యంలో మంగళవారం బరకాలు, కూరగాయలు, విత్తనాలు, సోలార్ లైట్లు ఉచితంగా పంపిణీ చేశారు. రామన్నపాలెం, పాలగూడెం, చింతూరు, కన్నాపురం, మల్లెతోట, నర్సింగపేట, మామిళ్ళగూడెం తదితర గ్రామాల్లో వీటిని ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ కోఆర్డినేటర్ ఊర్మిదాస్, సభ్యులు లక్ష్మి, మేరి, అహ్మద్ ఆలీ, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



వరద బాధితులకు సరకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వాలమూరు సమీపాన రహదారి కోతకు గురి కావడంతో వాహనాలకు ముప్పు పొంచి ఉంది.

– పల్లాల బాలకృష్ణారెడ్డి, వాలమూరు

✔: ఈ రహదారిలో ఏర్పడిన కోతకు అవసరమైన రక్షణ చర్యలు చేపడతాం. దీనికి మరమ్మతులు చేపట్టి, వాహనాలకు ఎటువంటి ప్రమాదం లేకుండ చూస్తాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే:

?: రాజవొమ్మంగి నుంచి విద్యానగర్ మీదుగా అప్పలరాజు పేట వెళ్లే మార్గంలో పలు చోట్ల రహదారి మరమ్మతులకు గురైంది. రాళ్లు పైకి తేలి అధ్వానంగా ఉంది.

– చరణ్. రాజవొమ్మంగి.

✔: సమస్యను సంబంధిత శాఖాధికారులతో చర్చిస్తాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం.

– యాదగిరీశ్వర రావు. ఎంపీడీవో. రాజవొమ్మంగి.

గేటు పునఃప్రారంభించాలని ఆందోళన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కించుమండ గిరిజన ప్రాథమిక పాఠశాలలో మూసివేసిన గేటును పునఃప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండు పాఠశాలలకు ప్రత్యేకంగా గేట్లు ఉండేవి. ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించడంతో ప్రాథమిక పాఠశాల గేటును కూడా తొలగించారు. దీంతో చిన్నారులు జాతీయ రహదారి మీదుగా పాఠశాలకు చేరుకోవాల్సి వస్తోందని, ఆ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. గేటును పునః ప్రారంభించాలని వేడుకుంటున్నా ఆశ్రమ పాఠశాల యాజమాన్యం స్పందించడం లేదని చెప్పారు. నిత్యం వాహన రాకపోకలతో చిన్నారులు పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంరక్షణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రహరీ నిర్మించాం. రెండు పాఠశాలలు ఒకే పరిధిలో ఉండటంతో ప్రధాన గేటు ద్వారా పాఠశాలకు చేరుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించామ'ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెన్ను వివరించారు.



కించుమండ జాతీయ రహదారిలో ఆందోళన చేస్తున్న గిరిజనులు